# ఆలంబన

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

ఎస్వీకే సంహితానాయుడు
92472 78740

లేదు. చెప్పాను కదా.. ఒక్క సెకను కూడా తను నన్ను ఖాళీగా కూర్చోనివ్వదు. అందుకే హాస్పిటల్ కెళ్తున్నానని చెప్పి వెళ్లాను. అక్కడ నాలాంటివాళ్లే గాక ఇంకా కొందరు అనాథలూ, దేశదిమ్మరులూ వరండాలో, చెట్ల కిందా, బెంచీల మీద పడుకొని హాయిగా నిద్రపోతుంటారు. ఎవ్వరూ పట్టించుకోరు. ఆ ధైర్యంతోనే వెళ్లి వరండాలో పడుకున్నాను. ఒళ్లు తెలీని నిద్ర పట్టేసింది. లేచేసరికి టైమ్ దాటిపోయింది. మీరు ఎదురు చూస్తుంటారని గుర్తొచ్చి గబగబా నడిచి వచ్చాను..'' అన్నది భవాని.

''నడిచొచ్చావా? అంతదూరం నుంచీ?'' కమ్ముకోబోతున్న ఆర్ద్రత నాలోంచి బాధగా వ్యక్తమైంది. గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి ఈ రాములవారి గుడి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కణ్నుంచి ఎనిమిది రూపాయల ఛార్జీతో వస్తుందామె రోజూ.

''దాచుకున్న పది రూపాయల నోటు.. నిద్రపోతుంటే ఎవరో కొంగుముడి విప్పదీసి దొంగిలించుకుపోయారు!''.

చలించిపోయాను నేను..

''క్షమించు భవానీ! నీ పరిస్థితి తెలీక అనవసరంగా కోప్పడ్డాను. అసలు నువ్వొస్తావో, రావోనన్న దిగులు నాకు తెలీకుండానే నన్ను కలవరపెడుతుంటే.. క్షణక్షణానికీ టెన్షన్ పెరిగిపోయి.. చివరికి నిన్ను చూడగానే అప్పటివరకూ నాలో ఉన్న అసహనాన్ని నీపైన కోపంగా ప్రదర్శించాను. అంతే!'' అన్నాను ఆర్తిగా.

అది వినగానే ఆమె హృదయంలో కదిలిన అనురాగం ఉప్పెనయి కళ్లలోకి చేరిందేమో.. నావైపు చూస్తూ అదే భావంతో అడిగింది..

''ఎందుకు నామీద మీకింతటి అభిమానం?''.

బదులుగా నా చూపుల్ని శూన్యంలోకి సారించాను.

''నీకు తెలీదు భవానీ.. నాకు అందరూ ఉన్నా ఇన్నాళ్లుగా ఒంటరిగా, ఇంట్లోవాళ్ల అపనిందలు, అవమానాలతో ఆత్మాభిమానాన్ని చంపుకొంటూ గడుపుతున్న నాకు.. అనుకోకుండా ఈ గుడిలో జరిగిన నీ పరిచయం, దొరికిన నీ సాన్నిధ్యం నాకో కొత్త మజిలీని చూపింది. ఏదో తపన! అందులో అపవిత్రత లేదు, వాంఛ లేదు. అలసిపోయిన నా మనసుకు నీ స్నేహం ఓ ఊరటలాగా అనిపించింది. నీ స్నేహంలో నాకు ఒకలాంటి నిశ్చింత లభిస్తున్నది. నా ఆరాటం మానసికమైనది. అది ఈ ప్రపంచానికి అర్థంకాదు. సమాజపు కట్టుబాట్లను నేను పట్టించుకోను. నాకు నువ్వు కావాలి. నీకు నా తోడు కావాలి. ఇద్దరికీ ఇద్దరి అవసరం ఉంది. చి..వ..రి..దా..కా..!'' ఏదో ధ్యానంలోంచి వెలువడ్తున్నట్లుగా ఉన్నాయి నా మాటలు.

''నాకూ మీరు కావాలి. కానీ, అది సాధ్యమా?'' అస్పష్టంగా అన్నది భవాని.

''ఎందుకు సాధ్యం కాదు? నీకోసం ఏదైనా వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను నేను!'' స్థిరత్వం ధ్వనించింది నా స్వరంలో.

ఆ స్థిరత్వం ఆమెకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందనడానికి సూచనగా తేలికగా నిట్టూర్పు విడుస్తూ..

''నాకు మీమీద నమ్మకం ఉంది. అందుకే దేవుడి గుళ్లో మీ దైవత్వాన్ని ఆస్వాదిస్తూ ఇంటికెళ్లాక ఆ అనుభూతితోనే నిశ్చింతగా ఉండగలుగుతున్నాను'' అన్నది.

''మనలాంటి వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టే వ్యక్తిత్వం అందరిలోనూ ఎందుకుండదు? స్వార్థం, ద్వేషం, కుతంత్రాలు, మరణాలు.. ఇవన్నీ ఎందుకిలా రాజ్యమేలుతున్నాయి? అన్నీ తెలిసికూడా అందులోనే ఎలా నవ్వుతూ ఉండగలరో నాకర్థం కాదు''.

నా మాటలు వింటూ నావైపే చూస్తున్నది భవాని. దూరంగా ఆకాశంలో సాయంసంధ్యలోని పసుపుదనం కిందికి పరచుకుంటూ వచ్చి భవాని శిరసును అభిషేకిస్తున్నది. అప్రయత్నంగా నా చూపులు ఆమె ఫాలభాగం మీద నిలిచిపోయాయి.

* * *

''ఏమిటీ.. రోజూ రాములవారి గుడి దగ్గర ఎవతినో కల్సుకోవడానికి వెళ్తున్నావట? ఏంటి కథ?''.

ప్రసాద్ కంఠంలో కర్కశత్వం నా వ్యక్తిత్వాన్ని నిలదీస్తున్నట్టుగా అనిపిస్తుంటే.. చివ్వున తల తిప్పి చూశాను.

''ప్రేమాయణమా..?'' వెటకారంగా అన్నాడీసారి.

''పదాలు దొరకని బంధాలకు ఒక్కొక్కరూ ఒక్కో అసహ్య సంబంధాన్ని అంటగట్టడం మామూలే కదా!''.

శాంతంగానే అన్నాను.

''ఓహోఁ.. సమర్థించుకోవడం ఒకటీ!''.

మళ్లీ ఎగతాళిగా అన్నాడు.

''నీ ఇష్టం.. నువ్వేమనుకున్నా సరే!'' అన్నాను సంయమనంగా.

''ఇంతకీ.. ఎవర్తదీ?''.

సంస్కారం ఏమాత్రం ధ్వనించని ప్రశ్న అతనిది.

''సంస్కారం తెలిసి ఉంటే ఈ ప్రశ్న ఇలా అడిగేవాడివి కాదు!''.

కోపాన్ని అణచుకుంటూ అన్నాను.

''నీ వితండవాదం వినే ఓపికా, తీరికా నాకు లేవు. ఇప్పటికే చుట్టుపక్కల వాళ్లు నానా రకాలుగా అనుకుంటున్నారు. రేపట్నుంచి నువ్వు ఇంట్లోంచి బైటికి కదలడానికి వీల్లేదు..'' ఆజ్ఞాపిస్తున్నట్టుగా అని..

''నీ ప్రవర్తన మార్చుకోకపోతే శాసించడమే కాదు.. శిక్షలు కూడా వేయాల్సివస్తుంది!'' అన్నాడు హెచ్చరికగా.

''అంత ధైర్యం ఎప్పుడొచ్చింది నీకు?'' అడిగాను నింపాదిగా.

''ధైర్యం అనేది సందర్భాల్ని బట్టి వస్తుంది. నీ విషయంలో ఇది పరువు, మర్యాదలకు సంబంధించింది. సమాజంలో కలిసి బతుకుతున్నాం కాబట్టి.. అది విధించిన కట్టుబాట్లను గౌరవించాల్సిన బాధ్యత అందరికీ ఉంది. అది నాచేత చెప్పించుకునే స్థితికి దిగజారావు. సిగ్గనిపించడం లేదూ?'' అన్నాడు ప్రసాద్.

''నేనేమిటో నాకు తెలుసు. ఒకరిచేత చెప్పించుకోవాల్సిన అగత్యం నాకు పట్టలేదు. నా మానాన నన్నొదిలేస్తే సంతోషిస్తాను..'' నా ధోరణిలో నేను బదులిచ్చాను.

''ఎదుటివార్ని బాధపెడ్తూ నువ్వు సంతోషపడటంలో అర్థం లేదు'' విసురుగా అన్నాడు ప్రసాద్.

''నీ దృష్టిలో బాధ ఉమ్మడిది, సంతోషం ఒక్కరిది కావచ్చు! కానీ, నేనొప్పుకోను. సంతోషం ఒకరితో మొదలైనపుడు అతని చుట్టుపక్కల వాళ్లక్కూడా అందే ఔషధం అది!''.. నేనేదో చెప్పబోయాను.

అంతలో.. లోపల్నుంచి ప్రసాద్ భార్య దూసుకొచ్చింది.

''పక్కింటి అనసూయ నోరు మామూల్ది కాదు. అలాంటిదాని నోట్లో ఈయనగారి నిర్వాకం పడిందంటే విశేషం కాదూ మరి?! హవ్వఁ.. ఆవిడ అనే మాటలు వినలేక సిగ్గుతో చచ్చిపోతున్నాను. ఇదిగో.. ఈ విషయం తేలేదాక వదిలిపెట్టేది లేదు. అసలు ఈయన